# మయూరి

మినీ కథ



ఎ. సుబ్బులక్ష్మి

ఏమండీ, ఈ రోజు మయూరి సినిమా లాస్ట్‌డే అంట. వెళదామాండీ అంది సుజాత సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చీరాగానే మళ్ళీ బయటకు బయలు దేరుతున్న భర్త రామంతో. ఒక్క క్షణం ఆలోచిస్తు న్నట్లు కళ్ళు మూసుకుని, తెరిచి అర్జంట్ వర్క్ తగిలింది. సెకండ్ షోకు వెళ్దాంలే అంటూ బయటికి నడిచాడు రామం.

సుజాతకు సినిమాలంటే పిచ్చి. అందులోనూ ఆనందభైరవి, శంకరా భరణం, మయూరి లాంటి శాస్త్రీయ సంగీతం, నాట్యం మెయిన్‌గాగల సినిమాలంటే మరీ పిచ్చి. ఇపుడు మయూరి సినిమా కూడ రెండు సార్లు చూడడం అయింది. ముచ్చటగా మూడవ సారి భర్తతో కలిసి చూడాలని కోరిక. భర్త సెకండ్ షో అనగానే హుషారుగా పిల్లలకు ఎనిమిది గంటలకే అన్నాలు వడ్డించింది. తనూ భోంచేసి భర్త కోసం భోజనం టేబులుపై రెడీగా సర్ది కాచుకుని కూర్చుంది. టైమ్ తొమ్మిది ఇరవై. రామం ఇంకా రాలేదు. సుజాతకు ఒక వంక మాట తప్పిన భర్తపై కోపంగానూ, ఇంకొక వంక పిక్చరు మిస్సవుతుందన్న బాధ గాను వుంది. నిమిషానికి రెండుసార్లు బయటికి వచ్చి వీధిలోకి చూస్తూంది. కనుచూపు మేరలో కూడ కనిపించ లేదు రామం. తొమ్మిది ఇరవై అయిదు. టైము పెరుగుతున్నకొద్దీ సుజాతలో కూడా చిరాకు, కోపం ఎక్కువగా పెరుగుతున్నాయి. కోపం పంతంగా మారింది. అతనికే అంత పట్టనపుడు తను అతని కోసం కాచు కునేది శుద్ధ దండగ అనిపించింది సుజాతకు. తనే వెళ్తే. అంతే, వెంటనే టెన్త్ క్లాస్ చదువుతున్న తమ్ముడు రవిని రెడీ కమ్మని ఇద్దరూ బయలు దేరారు తొమ్మిది ముప్పయి నిమిషాలకు. వెళ్ళేసరికి పిక్చరు బిగిన్ అయింది. హాలులోపల చీకటి. సీట్లు వెతుక్కుని కూర్చునేసరికి ఇంకొక అయిదు నిమిషాలు పట్టింది. సీట్లో కూర్చున్న వెంటనే సినిమాలో పూర్తిగా లీనమయిపోయింది సుజాత. పదినిమిషాలు గడిచిపోయినాయి. ఒక్క సారిగా సుజాత భృకుటి ముడిపడింది. మెడ దగ్గరగా వెచ్చని వూపిరి తగులుతూంది. వీపు కింద భాగాన చేతితో రాస్తున్నట్లు స్పర్శ. తన జడలో మల్లెల వాసన చూస్తున్నాడు ఎవడో వెధవ. కుర్చీకింద కాలుతో తన కాలును గోకుతున్నాడు. సుజాత సీటులో బాగా ముందుకు జరిగి కూర్చున్నా లాభం లేక పోయింది. తెరమీద విశ్రాంతి అని కనపడగానే లైట్లు వెలిగాయి. డర్టీరోగ్. మానర్‌లెస్ బ్రూట్ అంటూ సుజాత కోపంతో వెనక్కి తిరిగింది. ఖాళీ సీటు వెక్కిరించింది. సుజాతకు భర్తపైన పట్టరాని కోపం వచ్చింది. భర్తతో వచ్చుంటే వెనక వెధవ అంత ధైర్యం చేయలేదు. రవిని చిన్నవాడిగా ఎంచుకునే ఆ బ్రూట్ అంతగా బరితెగించినాడు. ఎందుకైన వచ్చానా? ఏడుపొస్తూంది సుజాతకు. పిక్చర్ మళ్ళీ బిగినయింది. లైట్స్ ఆఫ్ కాగానే వెనుక సీట్లో మనిషి వచ్చి కూర్చున్న అలికిడి అయింది. మళ్ళీ కథ మామూలే. సినిమా అయిపోయే వరకు ముళ్ళమీద కూర్చున్నట్లుంది సుజాతకు. తమ్ముడు వంక చూసింది. రవి ఇదేమి గమనించే స్థితిలో లేదు. సినిమా చూడడంలో పూర్తిగా మునిగి పోయి వున్నాడు. ఎప్పుడెప్పుడు సినిమా అయిపోతుందా అంటూ ఎదురుచూస్తుంది సుజాత అసహనంగా. సినిమా అయిపోయింది. లైట్స్ వెలగ్గానే లేచి నిలుచుంది సుజాత అపుడే పైకి లేచిన వెనుకసీటు శాల్తీని చూడగానే ఆమె ముఖం బాధతోను కోపంతోను ఎరుపెక్కింది.

ఇక ఆ శాల్తీ పని చెప్పక్కర లేదు. ముఖం వెలవెలా పోయింది. రక్తం లేనట్లు పాలిపోయి కళా విహీనమైపోయింది. అంతవరకు అసభ్యంగా, అసహ్యకరంగా ప్రవర్తించిన వెనుక సీటు శాల్తీ ఎవరో కాదు సుజాత భర్త రామం. ఇక ఆ సీను ఎలా వుంటుందో మనం వూహించగలము. సుజాతను ప్రసన్నం చేసుకోవడానికి రామం ఎన్ని అగచాట్లు పడ్డాడో ఏమో. ఆ తరువాత నుంచీ అతను జీవితంలో ఏ సినిమాకు ఒంటరిగా వెళ్ళలేదు మరి. సుజాత కూడ.

*

